మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
మంగళవారం 3 మార్చి 2026
పేజీలు : 4

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి చర్యలు.

### కలెక్టర్ కఠిన హెచ్చరిక



వివరాలు 2లో..

# మహిళలకు ...
# గుడ్ న్యూస్

**మహిళల సాధికారతకు ఏపీ ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు**

**మహిళా దినోత్సవం కానుకగా విద్య, వివాహం, ఉపాధికి కొత్త పథకాలు**





అమరావతి వేదికగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల సాధికారతే లక్ష్యంగా మూడు కీలక పథకాలను ప్రకటించింది. విద్య, వివాహం, ఉపాధి రంగాల్లో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మహిళలకు మేలు చేయనున్నాయి.

వివరాలు 2లో..

## సీఎం కు సూర్యలంక బీచ్
# సమగ్ర నివేదిక

**-- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ --**

సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అభివృద్ధి చేయడానికి రూపొందించిన సమగ్ర ప్రణాళికను రెండు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కు నివేదించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధే లక్ష్యంగా 35 పేజీల ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

వివరాలు 2లో..



## అంతరాష్ట్ర చైన్ స్నాచర్లకు పోలీసులు చెక్

నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు దుండగులను అదుపులోకి తీసుకున్న బాపట్ల పోలీసులు..

నేరస్తుల దగ్గర నుండి 24 లక్షల విలువ గల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు..

ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకున్న ఇద్దరు అంతరాష్ట్ర చైన్ స్నాచర్లను బాపట్ల పోలీసులు అరెస్ట్ చేసి నేరాలకు గట్టి చెక్ పెట్టి విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు..

వివరాలు 2లో..



# అంతరాష్ట్ర చైన్ స్నాచర్లకు పోలీసులు చెక్

**బాపట్ల రక్షణ బ్యూరో**



బాపట్ల జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నిందితుల నుంచి సుమారు 24 లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసైన పట్నాల వెంకట దుర్గా ప్రభు, షేక్ రాజా కలిసి కర్లపాలెం, పొన్నూరు, అద్దంకి, నరసరావుపేట ప్రాంతాల్లో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయాలను గమనించి నేరాలకు దిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేధించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, నిఘా వ్యవస్థను వినియోగించి నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు. నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో చైన్ స్నాచింగ్‌లను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి చర్యలు.

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా కీలక వ్యాఖ్యలు చేశారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. ఎస్. కే ఖాజావలి తదితరులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 350 అర్జీలు అందగా, అందులో 161 రెవెన్యూ శాఖకు, 229 ఇతర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయి. అర్జీలను పూర్తిగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల మేరకు పరిష్కారం కాని అంశాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి తాగునీరు, పారిశుధ్యం, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై అధికారులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ విధానంలో పథకాలపై అభిప్రాయాలు సేకరిస్తోందని, ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ వికలాంగుల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీఎం కు సూర్యలంక బీచ్ సమగ్ర నివేదిక

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల,రక్షణ న్యూస్**

సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి రెండు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కు నివేదించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పర్యాటక రంగం వృద్ధే లక్ష్యంగా నూతన విధానాలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇటీవల అధికారులతో కలిసి గోవా పర్యటన చేపట్టిన సందర్భంగా అక్కడి పర్యాటక అభివృద్ధి విధానాలు, నిర్వహణ తీరుపై సమగ్రంగా అధ్యయనం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గోవా చిన్న రాష్ట్రం అయినప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా ఎదగడానికి పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల భద్రతా ఏర్పాట్లు, రవాణాశాఖ ద్వారా ప్రజలకు సులభమైన రవాణా సౌకర్యాలు, ప్రతినెలా నిర్వహించే సాంస్కృతిక-ఆధ్యాత్మిక కార్యక్రమాలు గోవా విజయానికి ప్రధాన కారణాలన్నారు. కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించడం వల్లే అక్కడి బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ అనుభవాల ఆధారంగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక సహా ఇతర బీచ్‌ల అభివృద్ధికి 35 పేజీలతో ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్లు తెలిపారు. మంచి ప్రణాళిక, పట్టుదలతో ముందుకు వెళ్తే ఏదైనా సాధించవచ్చని అధికారులకు సూచించారు. ఇలాంటి పర్యటనలు, అధ్యయనాలు అధికారులకు నూతన ఆలోచనలను అందిస్తాయని అన్నారు. ఆర్మీ ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు డీఆర్‌డీఏ ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు కలిసి రూ. 10.54 లక్షల విరాళాన్ని సేకరించడం హర్షణీయమని తెలిపారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో సైనిక సంక్షేమ శాఖకు కలెక్టర్ అందజేశారు. అదేవిధంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమవుతున్న వేటపాలెం మండలానికి చెందిన ఎస్సీ అభ్యర్థి ప్రొద్దుటూరు దినకర్‌కు పీఎం-ఎజేఏవై పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డిజిటల్ ట్యాబ్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అంతర్జాతీయ వినికిడి దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రాలను విడుదల చేసి, వైద్య పరీక్షలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, డీఆర్ఓ జి. గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డీఆర్‌డీఏ బి. సింగయ్య, సైనిక సంక్షేమ శాఖ అధికారి గుణశీల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణ అధికారి జి. ఎన్. నరసింహారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు గుడ్ న్యూస్..

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు జిల్లా రక్షణ ప్రతినిధి..**

మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురసరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరచే దిశగా కీలక ముందడుగు వేసింది. సమాజంలో మహిళలు విద్యాపరంగా, ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలన్న లక్ష్యంతో మూడు ప్రధాన పథకాలను ఒకేసారి ప్రకటించడం రాష్ట్ర చరిత్రలో విశేషంగా మారింది. విద్యకు అడ్డంకులు తొలగించడం, కుమార్తె వివాహానికి ఆర్థిక భరోసా కల్పించడం, మహిళల ఉపాధికి డిజిటల్ శక్తిని అందించడం ఈ పథకాల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యారం గంలో బాలికలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు -- ముఖ్యంగా బాలికలు -- ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. చదువుల కోసం రూ. 1 లక్ష వరకు రుణాన్ని కేవలం పావలా వడ్డీకే అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్య కారణంగా ఏ బాలిక కూడా వెనుకబడకూ డదన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఇది వరంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. అదేవిధంగా కుమార్తె వివాహం పేద కుటుంబాలకు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకం మహిళా దినోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పథకం కింద అర్హులైన కుటుంబాలకు పెళ్లి జరిగిన 48 గంటల్లోనే ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు పెళ్లి సాయానికి సంబంధించి ఎదురవుతున్న జాప్యాలను తొలగించి, వేగంగా నిధులు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. ఆడబిడ్డల పెళ్లి కోసం అప్పులపాలయ్యే పరిస్థితి తగ్గించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది. మహిళల ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం మరో వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న మహిళా యానిమేటర్లకు ఉచిత స్మార్ట్‌ఫోన్లు అందించనున్నట్లు ప్రకటించింది. సుమారు రూ. 15,000 విలువైన ఆధునిక స్మార్ట్‌ఫోన్లను ఉచితంగా ఇవ్వడం ద్వారా డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో యానిమేటర్ల పాత్ర మరింత బలపడుతుందని అధికారులు తెలిపారు. డిజిటల్ పరిజ్ఞానం పెరగడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి దిశగా కూడా అడుగులు వేయగలరని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ మూడు పథకాలు కలిపి మహిళల జీవితంలో సమగ్ర మార్పు తీసుకువచ్చేలా రూపొందించబడ్డాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. చదువు ద్వారా ఆత్మవిశ్వాసం, వివాహానికి భరోసా, ఉపాధికి ఆధునిక సాంకేతిక సహకారం -- ఈ మూడు అంశాలు మహిళల సాధికారతకు పునాదిగా మారనున్నాయని తెలిపారు. జిల్లాల స్థాయిలో ఈ పథకాల అమలుకు త్వరలోనే పూర్తి మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. మహిళలే అభివృద్ధికి మూలస్తంభమన్న భావనతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఈ పథకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

# రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలు పంపిణీ

### వేమూరు నియోజకవర్గంలో పలు గ్రామాల రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు...

**వేమూరు రక్షణ న్యూస్**

వేమూరు నియోజకవర్గ పరిధిలోని చుండూరు మరియు అమృతలూరు మండలాల్లో రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజముద్రతో జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో నక్కా ఆనంద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన రైతులకు స్వయంగా పాస్‌పుస్తకాలను అందజేశారు. చుండూరు గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతుల భూహక్కులను బలపరిచే ఈ చర్య ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. భూమిపై చట్టబద్ధ హక్కులు స్పష్టంగా ఉండటం ద్వారా రైతుల ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని తెలిపారు. అమృతలూరు మండలం యలవర్రు గ్రామంలోని పాలకేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో సమావేశమై



వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. గ్రామీణాభివృద్ధికి భూమి హక్కుల రక్షణ బలమైన పునాది అని స్పష్టం చేశారు. ఈ రెండు కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన భవిష్యత్తు

### ప్రకృతి వ్యవసాయానికి రైతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పిలుపు...

**పల్నాడు రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లా పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పాంప్లెట్స్, పోస్టర్స్, హ్యాండ్‌బుక్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ, సహజ వనరులతో సాగు చేసే ప్రకృతి వ్యవసాయం రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని కలెక్టర్ వివరించారు. మట్టి సారాన్ని కాపాడుతూ, ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు, యువకులు, మహిళా సంఘాలు ప్రకృతి వ్యవసాయ



పద్ధతులపై మరింత మక్కువ చూపించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలు, సాంకేతిక సహాయం, ప్రోత్సాహకాలను వినియోగించుకుని ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో విస్తరించాలని పిలుపునిచ్చారు. జిల్లాను ప్రకృతి వ్యవసాయంలో ముందంజలో నిలపడం అందరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలకు సత్వర న్యాయం.. ఎస్పీ ఉమామహేశ్వర్

### అర్జీలపై అలసత్వం ఉండకూడదని ప్రజా సమస్యలపై బాధ్యతగా ఉండాలని అధికారులు ఆదేశించిన జిల్లా ఎస్పీ..

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 37 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సాధకబాధకాలను తెలుసుకున్నారు. అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరమైన పరిధిలో సత్వర న్యాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, కుటుంబ కలహాలు వంటి సమస్యలే ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో వర్చువల్ విధానంలో



సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్జీదారులు సమక్షంలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల తీవ్రతను తెలుసుకుని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్ణీత కాలపరిమితిలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదని, బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ పి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు

**పిట్టలవానిపాలెం రక్షణ న్యూస్**



పిట్టలవాని పాలెం మండలంలోని జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ విద్యార్థుల పరీక్షల సందర్భంగా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షిస్తూ, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షా కేంద్ర పరిసరాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి, నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన భద్రత కల్పించినట్లు ఎస్సై తెలిపారు.

# అభివృద్ధి పై ఎమ్మెల్యే ఫోకస్

### మాచర్ల పట్టణంలోని పలు వార్డులలో పర్యటిస్తూ పలు సమస్యలపై నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి...



**మాచర్ల రక్షణ న్యూస్**

మాచర్ల పట్టణంలో జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించి స్థానిక రాజకీయ వాతావరణాన్ని చురుకుగా మార్చారు. పట్టణంలోని 8, 9, 10, 11 వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ కాలువలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను తెలుసుకోవడం తమ రాజకీయ బాధ్యతలో భాగమని వెల్లడించారు. ఈ పర్యటనలో స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

3-3-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 3/3/2026 12:30 AM Page 4



## హెల్మెట్ తోనే సురక్షిత ప్రయాణం

### శాంతిభద్రతలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పర్చూరు ఎస్సై..




**పర్చూరు రక్షణ న్యూస్**

చెరుకూరు గ్రామంలో పర్చూరు ఎస్సై పులి గోపి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన స్పష్టం చేశారు. హెల్మెట్ ప్రాణ రక్షణకు అత్యంత కీలకమని, నిర్లక్ష్యం ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో చిన్నచిన్న విభేదాలు పెద్ద గొడవలకు దారితీయకుండా కలిసిమెలిసి జీవించాలని ప్రజలకు సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తినా స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి, సౌహార్ద వాతావరణం నెలకొల్పడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఐక్యతే బలం అని ఎస్సై పులి గోపి స్పష్టం చేశారు.

## ఆవుల అక్రమ రవాణాను అడ్డుకున్న పరిరక్షణ సమితి

**చిలకలూరిపేట రక్షణ న్యూస్**



చిలకలూరిపేట సమీపంలోని యడ్లపాడు జాతీయ రహదారిపై ఆవుల అక్రమ రవాణాను హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు అడ్డుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తుని ప్రాంతం నుంచి రెండు మినీ లారీల్లో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన ప్రతినిధులు వాహనాలను నిలిపివేశారు. ఆవులను కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు సమితి ప్రతినిధులు ఆరోపించారు. విషయం తెలిసిన వెంటనే యడ్లపాడు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఆవుల తరలింపు వెనుక ఉన్న కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# మల్లేశ్వరుని మహారధ యాత్ర



## కన్నుల పండుగగా కళ్యాణ మల్లేశ్వరుని దివ్య రథోత్సవం

**భట్టిప్రోలు రక్షణ న్యూస్**

భట్టిప్రోలు మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలోకళ్యాణమల్లేశ్వరుని దివ్య రథోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించగా, సోమవారం ఉదయం భక్తిశ్రద్ధల నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. అత్యంత సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్టించి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు “హర హర శంభో, శివ శివ” నినాదాలతో రథాన్ని లాగుతూ భక్తిరసాన్ని పంచారు. దారి పొడవునా మహిళలు హారతులు ఇస్తూ, టెంకాయలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి అత్తవారిల్లుగా పేరొందిన అద్దేపల్లి అమ్మవారి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రథాన్ని తిరిగి ఆలయ సమీపానికి చేర్చారు. ఈ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది భక్తులు తిలకించారు. ఇతర గ్రామాల నుంచి కూడా వందలాది మంది విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, దేవస్థానం ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు, భట్టిప్రోలు ఎస్సై ఎం. శివయ్య ఆధ్వర్యంలో సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ రథోత్సవం భట్టిప్రోలు ప్రాంతంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.

# అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**పల్నాడు రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లా అధికారికంగా కీలక సూచనలు జారీ చేశారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 163 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ క్లినిక్‌లో పాల్గొన్న దివ్యాంగులు, వికలాంగుల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని అర్జీలు స్వీకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతతో, సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సహా వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు పారదర్శక, సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.